క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



దశరథ దొళాయికి సాయాన్ని అందిస్తున్న సంస్థసభ్యులు

కవిటి: మండలంలోని వడ్డిజల్లుపుట్టుగకు చెందిన దశరథ దొళాయి కొంతకాలంగా ప్రేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈయనిది నిరుపేద కుటుంబం. ఇంటిపెద్ద మంచం పట్టడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. ఆపరేషన్ కోసం సుమారు రూ. రెండు లక్షలు ఖర్చవుతోందని వైద్యులు ప్రకటించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ స్వచ్ఛంద సంస్థ రూ. పది వేలు సేకరించింది. ఈ మొత్తాన్ని దశరథ దొళాయి ఇంటికి సంస్థ సభ్యులు ఆదివారం వెళ్లి అందజేసి ఆదర్శంగా నిలిచారు.

విద్యార్థినికి రూ. 20 వేల ఆర్థికసాయం



మేఘనకు ప్రోత్సాహక మొత్తాన్ని అందజేస్తున్న చైర్మన్ గిరిబాబు, దాతలు

కాశీబుగ్గ: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పలాస హైస్కూల్‌లో చదివి 592 మార్కులు సాధించిన విద్యార్థిని మేఘన మహారణను పలువురు అభినందించారు. ఆమె ప్రతిభను మెచ్చి ఉన్నత చదువులకు ఉపయోగపడాలని ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థిని తండ్రి రఘునాథ మహారణతో చదువుకున్న స్నేహితులంతా కలిసి 20 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు చేతుల మీదుగా మేఘన మహారణకు ఆదివారం అందించి అభినందించారు. కార్యక్రమంలో మల్లా కుమారస్వామి, పి.మధు, క్రిష్ణచంద్ర సాహు, రమేష్ సాహు, ఉప్పాడ అప్పారావు, బెలిసాంతీ శ్రీను, బి.భీమరాజు, బోసుబాబు ఉన్నారు.


కళాకారులను గౌరవించాలి



సంగీత కచేరి నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట: భావితరాలకు కళలను అందజేస్తున్న సంగీత కళాకారులను ప్రతీ ఒక్కరూ గౌరవించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని ఇస్కలపాలేం గ్రామంలో కళాభారతి కళాకారుల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో సంగీత కచేరి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన సంక్షేమ సమాఖ్య కళాకారులు కచేరి కార్యక్రమంలో పాల్గొని సంగీత ప్రియులను అలరించారు. గ్రామస్తులు, కళాకారుల కమిటీ ఆధ్వర్యంలో కళాకారులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ కళాకారులు, పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చిత్రలేఖనంతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న చిత్రకారుడు కనకరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు చిత్రలేఖనం అలవాటుగా మార్చుకుంటే ఒత్తిడి దూరమై, విద్యలో రాణిస్తారని చిత్రకారుడు ధర్మవరపు కనకరాజు అన్నారు. ధర్మవరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్ర లేఖనంపై ఆదివారం అవగాహన కల్పించారు. చిన్న చిన్న చిత్రాలు, కార్టూన్లతో ముందుగా సాధన చేయాలన్నారు. ఆసక్తి ఉన్నవారు మంచి చిత్రకారులుగా తయారవుతారని పేర్కొన్నారు. సృజనాత్మక కళ, సామాజిక స్పృహ ఉన్నవారు మంచి చిత్రాలు గీస్తారని చెప్పారు. పత్రికల్లో వస్తున్న కార్టూన్లు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

సుందరాకాండ పారాయణ సప్తాహం



సుందరాకాండ పారాయణ చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జెడ్పీ ఎదుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలోని షిర్డీసాయి ఆధ్యాత్మిక ధ్యాన మందిరంలో హనుమజ్జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని సుందరాకాండ పారాయణ సప్తాహం ఆదివారం ప్రారంభమైంది. ఆధ్యాత్మిక ప్రవచకులు భాస్కభట్ల శ్రీరామశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పెంట శ్రీనివాసశర్మ నేతృత్వంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, రామకోటిలేఖనం, సుందరాకాండ పారాయణ జరిగింది.

• అంతరకుడ్డలో కార్డన్ సెర్చ్



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడోవార్డు అంతరకుడ్డ గ్రామంలో శనివారం ఉదయం కాశీబుగ్గ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు అనుమానం ఉన్న ఇళ్లలో సోదా చేశారు. అక్రమ మద్య నిల్వలపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేని వాహనాలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ వెంకటరావు, క్రైం హెచ్‌సీ అట్ల శ్రీనివాసరావు, పీసీలు కోదండరావు, యవ్వారి కామేశ్వరరావు, తులసీరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

-కాశీబుగ్గ

• ఉత్సవ సందడి



టెక్కలి మండలం పెద్దరోకళ్లపల్లి గ్రామంలో ఆదివారం నుంచి ముత్యాలమ్మతల్లి గ్రామదేవత అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. సర్పంచ్ రాంపాత్రుని అనూషారెడ్డి పర్యవేక్షణలో గ్రామస్తుల సహకారంతో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. మొదటి రోజు అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. రథాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకుంది.

-టెక్కలి

• తీరం కళకళ



వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరం ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. తుపాను ప్రభావంతో రోజంతా వాతావరణం చల్లగా ఉండటంతో పర్యాటకులు తీరానికి చేరుకొని వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు. ఒడిశాలోని పలు ప్రాంతాలతో పాటు పలాస, కాశీబుగ్గ పరిసర ప్రాంతాల నుంచి పర్యాటకులు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సహపంక్తి భోజనాలు చేసి తీరంలో అటపాటలతో ఆనందంగా గడిపారు. తుపాను ప్రభావంతో సముద్ర అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతుండటంతో మైరెన్ పోలీసులు పర్యాటకులను అప్రమత్తం చేశారు.

-వజ్రపుకొత్తూరు రూరల్

నేడు బొడ్డపాడులో అమరుల సంస్మరణ సభ



అమరులకు జోహార్లు అర్పిస్తున్న విప్లవ సంఘాల ప్రతినిధులు

పలాస: బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద సోమవారం సాయంత్రం జిల్లా అమరవీరుల సంస్మరణ సభ జరగనుంది. ఈ సభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు బొడ్డపాడులో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. 1969 మే 27న తొలి బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆనాటి జిల్లా ఉద్యమ నేత పంచాది కృష్ణమూర్తితో పాటు ఏడుగురు విప్లవకారులను పట్టుకొని పోలీసులు కాల్చి చంపారని ఆరోపించారు. అనంతరం జిల్లాలో 1969 నుంచి 1973 వరకు వివిధ ఎన్‌కౌంటర్లల్లో సుమారు 360 మంది విప్లవవీరులను పట్టుకొని పోలీసులు హత్యలు చేశారన్నారు. ఆ విప్లవ వీరుల జ్ఞాపకార్థం ఏటా బొడ్డపాడులో వివిధ విప్లవ సంస్థల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్మారక సభను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా స్మారిక మందిరం వద్ద అమరులకు జోహార్లు అర్పించారు. నాయకులు తామడ సన్యాసిరావు, దుష్యంతరావు, కామేశ్వరరావు, మద్దిల రామారావు, మద్దిల కైలాస్, గొరకల బాలక్రిష్ణ, పోతనపల్లి కుసుమ, రాపాక మాధవరావు, గోపి పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా యూహెచ్‌సీ



కోసంగిపురం యూహెచ్‌సీ భవన సముదాయం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం కూడలి వద్ద ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ పనులు పూర్తయ్యాయి. మున్సిపాలిటీకి మూడు కేంద్రాలు మంజూరు కాగా అందులో ఇదొక్కటి. శరవేగంగా నిర్మితమవుతున్న జగనన్నకాలనీ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, ఏపీ టిడ్కో, ఎంబిజీ సైట్‌లతో పాటు పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి సుమారు ఐదు వేల మందికిపైగా ప్రజానికానికి అందుబాటులో ఉండే యుహెచ్‌సీని రూ.80 లక్షలతో నిర్మించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రారంభ కార్యక్రమం వాయిదా పడింది. ఎన్నికల ఫలితాల అనంతరం దీనిని ప్రారంభించే యోచనలో మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు



పల్లకీసేవలో సత్యసాయి భక్తులు

కవిటి: ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం ద్వారానే మానసిక ప్రశాంతత సాధ్యమని సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షులు ఎస్.రామచంద్రరావు అన్నారు. మండలంలోని సన్యాసపుట్టుగ గ్రామంలో ఉన్న సత్యసాయి మందిరం 12వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి భజన మండలి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున సాయి గాయత్రి జపాన్ని ఆచరించారు. అనంతరం నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల భజన బృందాలతో ఏకాహం, సత్యసాయి భజన కాలక్షేపాన్ని చేశారు. అనంతరం నిర్వహించిన సభలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెలలో జరగనున్న పత్తి యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు సంస్థల భజన మండలి అధ్యక్షులు బోర చిన్నారావు, ప్రియా అప్పలనాయుడు, కాశీ విశ్వనాథ్, బల్లెడ శాంతమూర్తి ఉన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ



మరిడమ్మకు ఎస్పీ రాధిక ప్రత్యేక పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మెడ్ రిజర్వ్ కార్యాలయం సమీపంలో వెలసివున్న మరిడమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ వైశాఖ మాసంలో ఇక్కడ మరిడమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజల్లో భాగంగా జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక అమ్మవారి పట్టు వస్త్రాలు, భోనాలు సమర్పించారు. అర్చకులు ఎస్పీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీ ఎల్.శేషాద్రి నాయుడు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, రమేష్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పండ్లు పంపిణీ



నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలోని చిన్నారులు, వృద్ధులకు ట్రూ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు, డ్రింక్స్‌ను ఆదివారం పంపిణీ చేశారు. మట్టా మహేష్‌కుమార్, పరిటాల ప్రభాకర్‌ల నాలుగో వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాన్ని చేసినట్టు శ్రీకూర్మాం దేవస్థానం పాలకమండలి సభ్యుడు పొన్నాడ రుషి, దక్షిణ హిందీ ప్రచార సభ కార్యదర్శి, సీనియర్ ఫిజియో థెరపిస్టు డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్‌లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ తాహసీల్దారు బి.ఉమామహేశ్వరరావు, పవలర్తి సునీల్ కుమార్, గర్భాపు ప్రభాకర్, కన్నబాబు, డి.నాని, ఎ.చంద్రబాబు, ఆర్.మధు, బి.శ్రీనివాస్, కె.వెంకటేష్ పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మోహనరావు

టెక్కలి: విద్యార్థి దశలో ప్రాథమిక స్థాయి నుంచి స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన ఉండాలని విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం.మోహనరావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు తో పాటు ఇంగ్లిష్ భాషపై నైపుణ్యం సంపాదించాలన్నారు. గ్రంథాలయాధికారి బి.రూపావతి ఉన్నారు.

ఘనంగా దుర్గమ్మ సంబరం

సోంపేట: బెంకిలి గ్రామంలో బాయిదుర్గమ్మ సంబరాన్ని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో అమ్మవారికి తిరువీధి చేపట్టారు. పగటి వేషాలు అలరించాయి. బెంకిలి పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు చింత ప్రకాష్, చింత్ర సోమశేఖర్, శ్రీధర్ పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు సాయం



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని అర్జునాపురం గ్రామానికి చెందిన విశ్రాంత సైనిక ఉద్యోగి బుద్దేపు మోహనరావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. దీంతో స్పందించిన కంచిలి మండల మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మృతుడు మోహనరావు దహన సంస్కారాల కోసం రూ.5 వేలను సమకూర్చారు. ఈ మొత్తాన్ని మృతుని భార్యకు అందజేశారు. అలాగే మోహనరావు మృతదేహానికి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు పైల మన్మథరెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణారావు, జీరు లోకనాథం, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తతస్థాయి సమావేశం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు జరగనుంది. పలాసలోని మందిరి అప్పలరాజు క్యాంపు కార్యాలయం వద్ద జరగనున్న సమావేశంలో నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్‌లు హాజరు కావాలని మంత్రి కార్యాలయం నుంచి ఆదివారం వెలువడిన ప్రకటనలో కోరారు.

నేటినుంచి చిన్నారులకు శిక్షణ శిబిరం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని ఇల్లీసుపురం సమీపంలో తిలక్‌నగర్‌లోని పాత ఎంప్లాయిమెంట్ ఆఫీసు సమీపంలో ఉన్న యూటీఎఫ్ భవన్‌లో వేసవి వినోదం పేరిట పిల్లలకు సోమవారం నుంచి వివిధ అంశాల్లో ఉచిత శిక్షణను అందించనున్నారు. క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జూన్ 3 తేదీ వరకు వారం రోజులపాటు రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. నాలుగు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు ఈ క్యాంపులను నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ కన్వీనర్ చింతాడ కృష్ణారావు మాస్టారు ఆదివారం తెలిపారు. డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, కథ చెబుదాం, డ్రామా, చిరునాటిక, స్పెల్లింగ్ బింగో, క్విజ్, పాటలు, కవితలు, సెల్ఫ్ డిఫెన్స్, న్యూస్ రీడింగ్, కనుక్కోండి చూద్దాం, టీమ్ యాక్టివిటీస్, ఫన్ మాథ్స్, సైన్స్‌తో సరదా, ఫన్ అండ్ మెమొరీ గేమ్స్, మంటలేని వంట, డెమెస్టిక్ వర్క్, శ్రమదానం, కరాటే శిక్షణ, మేజిక్ వంటి అంశాలలో శిక్షణ, అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు.

కంప్యూటర్‌పై అవగాహన అవసరం

ఎచ్చెర్ల: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు కంప్యూటర్ విజ్ఞానంపై అవగాహన అవసరమని రీసోర్స్ పర్సన్ భోగాపురం వెంకటనాగశ్రీవిద్య అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కంప్యూటర్, భాషలు, ఆపరేటింగ్ సిస్టం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, టి.వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

• ఆత్మీయ సమ్మేళనం



కాశీబుగ్గ: సొండిపూడి హైస్కూల్‌లో ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: వారంతా ఒకే తరగతి గదిలో చదువుకున్నారు. ఇప్పుడు వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. స్వగ్రామాలకు వచ్చిన వారంతా ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మందస మండలం సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తరువాత చదువుకున్న పాఠశాలలోనే ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను, ప్రస్తుత పాఠశాల సిబ్బందిని సన్మానించి గౌరవించారు. పూర్వ విద్యార్థులు జి.భీమారావు, కె.విద్యాసాగర్, వై.రాజు, పి.మోహన్‌రావు, వై.శ్రీను ఉన్నారు. తమ బ్యాచ్ గుర్తుగా పాఠశాలకు 20 వేల రూపాయలు సామగ్రిని అందజేశారు.

• 27 సంవత్సరాల తరువాత..



సోంపేట: బారువ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

సోంపేట: బారువ ఉన్నత పాఠశాలలో 1995–96వ విద్యాసంవత్సరంలో పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. 27 సంవత్సరాల తరువాత వారంతా ఒకే చోట చేరి చదువుకున్న రోజులను నెమరు వేసుకున్నారు. ప్రస్తుత జీవితాలు గురించి అడిగితెలుసుకున్నారు. చదువు నేర్పిన గురువులు యర్ర విశ్వనాథం, వసంతరావు, చంద్రశేఖర్, జనార్ధనరావు, వాసు, ఎ.ధనుంజయలను దుశ్శాలువాలతో సత్కరించి గౌరవించారు.

• మధుర జ్ఞాపకాలు



వజ్రపుకొత్తూరు రూరల్: ఒకేచోట కలుసుకున్న అక్కుపల్లి పాఠశాల పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు స్థానిక నీలకంఠేశ్వర ప్రాంగాణంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ అలనాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. గ్రూపు ఫొటోలు తీసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

అండర్-14 క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలకు హాజరైన జట్లతో నిర్వాహకులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని సురంగి రాజా క్రీడా మైదానం ఆవరణలో జూనియర్స్ అండర్-14 క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జీఎస్‌ఆర్ క్రికెట్‌క్లబ్, హైదారాబాద్ వారి సౌజన్యంతో ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ వారు ఎన్‌బీపీఎల్ (నరసింహ భానుమతి ప్రీమియర్ లీగ్) నిర్వహించారు. ఈ పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో స్థానిక డోనర్స్ దక్కత సుమన్, బి.బాలాజీ, బి.వెంకటరమణ, కాళ్ల నరసింహమూర్తి, ఎన్.యాదవ్, క్రికెట్ కోచ్ డి.గోపి పాల్గొన్నారు.


శ్రద్ధాంజలి
మహోన్నత వ్యక్తిత్వంతో అందరి మనస్సులలో సుస్థిర స్థానం సంపాదించి, ఆకస్మికంగా దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
భర్త: నంబూరు భాస్కరరావు
రిటైర్డు ప్రిన్సిపాల్
కుమారులు
నంబూరు కుమారస్వామి - మాధవి
Software Engineer (USA) Software Engineer (USA)
నంబూరు ఆనంద్ - సుధ
మనుమరాళ్లు: సౌఖ్య, హృదయ
మరియు ఇతర కుటుంబసభ్యులు
కీ॥శే॥ నంబూరు జానకమ్మ గారు
జననం: 14.05.1958, మరణం: 15.05.2024
గోపినాధపురం, టెక్కలి మండలం
పెద్దకర్మ: తే 27.05.2024 దివ సోమవారం నాడు టెక్కలి, గోపినాధపురం లో మా స్వగృహమునందు జరుగును.